# కామన్‌వెల్త్... 53 దేశాల కీలక గ్రూప్!

**ద కామన్‌వెల్త్... మొదట్లో దీన్ని బ్రిటీష్ కామన్‌వెల్త్ ఆఫ్ నేషన్స్ అనేవారు. గతంలో బ్రిటీష్ సామ్రాజ్య వలస పాలన కింద కొనసాగిన ఈ దేశాలు... తదనంతరం ఉమ్మడి లక్ష్యాల సాధన కోసం కామన్‌వెల్త్‌గా ఏర్పడ్డాయి. ఇందులో సభ్య దేశాల సంఖ్య 53. కామన్‌వెల్త్ ప్రధాన కార్యాలయం లండన్‌లో ఉంది. ఈ గ్రూప్‌లోని దేశాల మధ్య ఆర్థిక అంతరాలు ప్రస్ఫుటం. అయితే, అంతర్జాతీయ వాణిజ్యంలో కామన్‌వెల్త్ వాటా 20 శాతంగా ఉంది. కామన్‌వెల్త్ గౌరవ అధినేత (సింబాలిక్ హెడ్) బ్రిటన్ రాణి!!**

కామన్‌వెల్త్‌లో మొత్తం 53 సభ్య దేశాలున్నాయి. ఈ గ్రూపులోని దేశాల మధ్య సంప్రదింపులు జరిగేలా చూసే బాధ్యత కామన్ వెల్త్ సెక్రటేరియట్‌ది.. ఇది 1965లో ఏర్పాటయింది. ఇది ఏడాదికి రెండుసార్లు కామన్‌వెల్త్ దేశాల ప్రభుత్వాధినేతల సదస్సులను నిర్వహిస్తుంది. అంతేకాకుండా.. సంవత్సరానికి ఒకసారి ఆయా సభ్య దేశాల ఆర్థిక మంత్రుల సదస్సులను ఏర్పాటు చేస్తుంది. దాంతోపాటు విద్య, న్యాయ, ఆరోగ్య మంత్రుల సమావేశాలను కూడా నిర్వహిస్తుంది.

### ముఖ్య ఆర్థిక శక్తి:

కామన్‌వెల్త్ దేశాల మధ్య ఆర్థిక అంతరాలు అధికం. మొత్తంగా చూస్తే మాత్రం ఈ గ్రూప్ ప్రపంచంలోనే ప్రధానమైన ఆర్థిక శక్తి. అంతర్జాతీయ వాణిజ్యంలో కామన్‌వెల్త్ వాటా 20 శాతం. ప్రపంచంలోని దాదాపు మూడొంతుల దేశాలకు కామన్ వెల్త్‌లో సభ్యత్వం ఉంది. వీటిలో అధికశాతం అభివృద్ధి చెందుతున్న దేశాలే! ఈ దేశాలు తమ ఉమ్మడి సమస్యలు, లక్ష్యాల సాధన దిశగా... తమలో తాము సంప్రదింపులు, చర్చలు జరుపుకునేందుకు, తీర్మానాలు చేసుకునేందుకు ఇది ఒక వేదికగా ఉపయోగపడుతోందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

### చోగమ్ సదస్సు:

చోగమ్ (సీహెచ్‌ఓజీఎం)అంటే... కామన్‌వెల్త్ హెడ్స్ ఆఫ్ గవర్న మెంట్ మీటింగ్. చోగమ్ సదస్సు 2007, నవంబరులో ఉగండాలోని కంపాలాలో జరిగింది. 2007, నవంబరు 24న లండన్‌లోని భారత హైకమిషనర్ కమలేశ్ శర్మ కామన్‌వెల్త్ సెక్రటరీ జనరల్‌గా ఎంపికయ్యారు. భారతదేశం తరపున సదస్సుకు హాజరైన ప్రధాన మంత్రి మన్మోహన్ సింగ్ మాట్లాడుతూ... కమలేశ్ శర్మ దార్శనికత, విస్తృత ప్రజాసేవకు అంతర్జాతీయ సమాజం గుర్తింపు లభించిందని, దానికి నిదర్శనంగానే కామన్‌వెల్త్ సెక్రటరీగా ఆయన ఎంపిక జరిగిందని ప్రశంసించారు. ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి పదవికి భారతీయుడిని ఎంపికయ్యేట్లు చూడటంలో వైఫల్యం ఎదురైన నేపథ్యంలో... కామన్‌వెల్త్ సెక్రటరీ జనరల్‌గా కమలేశ్ శర్మ ఎన్నిక .. భారతీయ దౌత్య విజయమని నిపుణులు పేర్కొంటున్నారు. అంతేకాకుండా... ఇది అంతర్జా

తీయ వ్యవహారాల్లో భారత్‌కు రోజురోజుకూ పెరుగుతున్న ప్రాధాన్యానికి నిదర్శనమంటున్నారు. కామన్‌వెల్త్ సెక్రటరీ జనరల్‌గా భారతీయుడు ఉన్నందున ఈ వేదికపై భవిష్యత్తులో భారత్ మరింత కీలక పాత్ర పోషించే అవకాశముందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

### కామన్‌వెల్త్ పాత్ర:

21వ శతాబ్ద గమనానికి కామన్‌వెల్త్ దిశానిర్దేశం చేయాల్సిన సమయం ఆసన్నమైందని గ్రూప్ కొత్త సెక్రటరీ జనరల్ కమలేశ్ శర్మ అభిప్రాయపడ్డారు. ప్రపంచీకరణ యుగంలో... అందివస్తున్న అవకాశాలు, ముంచుకొస్తున్న ముప్పుల గురించి కామన్ వెల్త్ దేశాలు విస్తృతంగా చర్చించాలన్నారు. అంతర్జాతీయ సమస్యల గురించి కామన్‌వెల్త్ జరిపే చర్చల నాణ్యతను పెంచాల్సి ఉందని శర్మ పేర్కొన్నారు. చర్చల్లో భిన్నాభిప్రాయలను వ్యక్తం చేయడాన్ని ప్రోత్సహించాలని...ఆ తర్వాత ఏకాభిప్రాయ సాధన దిశగా ప్రయత్నించాలని ఆయన తెలిపారు. అభివృద్ధి, సుపరిపాలన, సహకారం తదితర అంశాలకు సంబంధించి.. వివిధ దేశాల భిన్న పంథాల మధ్య సమన్వయం సాధించే దిశగా కృషి జరగాలన్నారు.

### కామన్‌వెల్త్ అవసరముందా?!

ప్రస్తుతం అంతర్జాతీయ వ్యవహారాల్లో...అసలు కామన్‌వెల్త్ పాత్ర ఏంటి? దాని అవసరముందా? ఉంటే ఏమేరకు? కామన్ వెల్త్ వల్ల ప్రయోజనం ఏంటి? అనే పలు ప్రశ్నలను విమర్శకులు లేవనెత్తుతున్నారు. అన్ని అంతర్జాతీయ సంస్థలకు మాదిరిగానే దీనికీ సానుకూలాంశాలు, ప్రతికూలాంశాలు రెండూ ఉన్నాయి.

**సానుకూలాంశాలు...** కామన్‌వెల్త్ భిన్న వ్యవస్థలతో కూడిన విభిన్న దేశాల ఓ వేదిక. ఇందులో అభివృద్ధి చెందిన దేశాలతోపాటు అభివృద్ధి చెందుతున్న దేశాలకు కూడా సభ్యత్వం ఉంది. అందువల్ల ఇది వాస్తవిక ప్రపంచానికి ప్రతిబింబం వంటిది. కామన్‌వెల్త్ వేదికపై పేద, ధనిక దేశాలు రెండింటికీ సమ ప్రాధాన్యం ఉంటుంది. దానివల్ల ఇక్కడ పేద దేశాలు కూడా తమ సాదకబాధకాలను, సమస్యలను బలంగా వినిపించే అవకాశముంటుంది. 53 దేశాలకు సభ్యత్వమున్న కామన్‌వెల్త్ చేసే ప్రతిపాదనలకు, సూచనలకు ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీవో) వంటి అంతర్జాతీయ సంస్థలు తప్పక ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉంటుంది. ప్రత్యేకంగా వాణిజ్య కూటములు ఆవిర్భవించ కుండా.. కామన్‌వెల్త్ సభ్య దేశాలు ప్రాంతీయ గ్రూప్‌ల ఏర్పాటు ప్రతిపాదనను గట్టిగా సమర్థించుకోవచ్చు. చోగమ్ సదస్సుకు సభ్య దేశాలు హాజరైన తీరును.. కామన్‌వెల్త్‌లో సభ్యత్వం కోసం పలు దేశాలు పోటీపడటాన్ని చూస్తే... కామన్‌వెల్త్ వలస దేశాల గ్రూప్ స్థాయి నుంచి అంతర్జాతీయంగా ప్రభావశీల ప్రాంతీయ కూటమి స్థాయికి పరిణామం చెందినట్లు భావించవచ్చు.

**ప్రతికూలాంశాలు...** కామన్‌వెల్త్ కేవలం చర్చలకే పరిమిత మవుతోందని... చేతలు మాత్రం శూన్యమని విమర్శకులు పేర్కొంటున్నారు. గ్రూప్‌లోని మూడు ధనిక దేశాలకు వంత పాడేందుకే మిగత దేశాలు ప్రాధాన్యం ఇస్తున్నాయనే ఆరోపణ ఉంది. రాజకీయ, సైద్ధాంతిక అంశాలతో సంబంధం లేకుండా కామన్‌వెల్త్ ఏర్పాటైంది. దేశాల మధ్య అనేకాంశాల్లో భిన్నత్వం విస్పష్టం. ఉమ్మడి లక్షణాలు అరుదు. అంతర్జాతీయ వ్యవహారాలను ప్రభావితం చేసేటంత ఆర్థిక, రాజకీయ బలం కూడా కామన్వెల్త్‌కు లేదని విమర్శకుల వాదన.

## ముగింపు:

కామన్‌వెల్త్ కారణంగా అంతర్జాతీయ వ్యవహారాల్లో నాయకత్వ పాత్ర పోషించే అవకాశం భారత్‌కు లభిస్తోంది. అంతేకాకుండా.. అంతర్జాతీయ వేదికలపై ఆఫ్రికా, ఆసియా దేశాల తరపున మాట్లాడే వీలుకలుగుతోంది. అలీనోదమ్యం ప్రస్తుతం ఆశించినంత క్రియాశీలక పాత్ర పోషించడంలో విఫలమవుతోంది. ఈ నేపథ్యంలో... ఆఫ్రికా, ఆసియా దేశాల తరపున భారత్ చురుకైన నాయకత్వ పాత్ర పోషించవచ్చు. భారత ప్రథమ ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ పేర్కొనట్లు.. కామన్‌వెల్త్ విలువలకు భారత్ అద్దం వంటిది. ఎందుకంటే.. కామన్‌వెల్త్ సభ్య దేశాల భిన్నత్వం భారత్‌లోనూ కనిపిస్తుంది. ప్రజాస్వామ్య విలువలకు కట్టుబడి ఉన్న భారత్... ప్రజాస్వామ్యం దిశగా పరిణామం చెందాలని పోరాడుతున్న దేశాలకు సూచనలు, సలహాలు ఇవ్వగలదు. భారత శాస్త్ర సాంకేతిక విజ్ఞానం, ఆర్థిక ప్రగతి... కామన్‌వెల్త్‌లోని ఆఫ్రికా– ఆసియా దేశాలకు ఎంతో ఉపయుక్తం. ద కామన్వెల్త్ ఫండ్ ఫర్ టెక్నికల్ కో ఆపరేషన్ ద్వారా... ఆసియా– ఆఫ్రికా దేశాలకు భారత్ ఈ విషయంలో సాయం అందించవచ్చు. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ రంగంలో దూసుకుపోతున్న భారత్... ఆ రంగంలో కామన్‌వెల్త్ దేశాలతో సంబంధాలు పెట్టుకోవచ్చు. మాజీ రాష్ట్రపతి ఎ.పి.జె.అబ్దుల్‌కలాం ప్రతిపాదించిన పాన్ ఆఫ్రికన్ ఈ–నెట్‌వర్క్ వంటి ప్రాజెక్టులను అమలుచేయవచ్చు. కీలకమైన ప్రస్తుత అంతర్జాతీయ ఆర్థిక, రాజకీయ పరిస్థితుల్లో... కామన్‌వెల్త్ దేశాల మధ్య సహకారం ఎంతో అవసరమని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. రాజకీయ అంశాలకు అంతగా ప్రాధాన్యం ఇవ్వకుండా.. సభ్యదేశాలు పరస్పరం సహకరించుకోవాలని సూచిస్తున్నారు. కామన్‌వెల్త్ దేశాలు అర్థవంతమైన ఆర్థిక సహకారం దిశగా దృష్టిసారించాలని పేర్కొంటున్నారు!!